క్లుప్తంగా

సామాజిక తనిఖీ

దుమ్ముగూడెం: మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద సామాజిక తనిఖీని గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ప్రజావేదిక ద్వారా నిర్వహించాల్సిన ఈ తనిఖీని ఎన్నికల కోడ్ అమలు దృష్ట్యా ఇన్ హౌజ్ వేదిక ద్వారా ఆడిట్ చేపట్టారు. ఏపీడీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సోషల్ ఆడిట్ సభ్యులు గత 10 రోజులుగా 2020, నవంబర్ 1 నుంచి 2023, మార్చి 31 వరకు ఈజీఎస్ పథకం కింద చేపట్టిన పనుల వివరాలను సర్వే నిర్వహించారు. సుమారు 15.91కోట్లకు సంబంధించి ఆడిట్ జరుగుతుండగా శుక్రవారం పూర్తి వివరాలు తెలిసే అవకాశాలు ఉన్నాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ ముత్యాలరావు, ఏపీఓ సుకన్య, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే పోస్టులపై చర్యలు

భద్రాచలంఅర్బన్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఎవరైనా సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే వారిపై చట్టప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని భద్రాచలం టౌన్ సీఐ నాగరాజు రెడ్డి హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరమైన చిత్రాలు, వీడియోలను పోస్ట్ చేయవద్దని, వ్యక్తిగత దూషణకు దిగడం, వార్నింగ్ ఇవ్వడం, అంతర్గత వివరాలు గురించి అనవసర పోస్టులు, కామెంట్లు పెట్టొద్దని సూచించారు. వాట్సాప్ గ్రూప్‌ల విషయంలో దీనిపై అడ్మిన్‌లే బాధ్యత వహించాలని అన్నారు. కార్యక్రమంలో టౌన్ ఎస్సైలు మధుప్రసాద్, పీవీఎన్ రావులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు

అశ్వారావుపేటరూరల్: వర్షాలు లేక పంటలు ఎండిపోతున్న తరుణంలో గురువారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని వడ్డెర రంగాపురం గ్రామంలో మహిళలు రాత్రంతా ఉపవాసం ఉండి, ఆ తర్వాత గ్రామ పొలిమేరలో 108 బిందెలతో జలాభిషేకాలు చేశారు. అలాగే గ్రామ దేవతలకు పలు రకాల వంటలతో తయారీ చేసిన నైవేద్యాలను సమర్పించి, మొక్కులు మొక్కారు.

స.హ. చట్టంపై అవగాహన ఉండాలి

దుమ్ముగూడెం: ప్రతి ఒక్కరికీ సమాచార హక్కు చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సామాజిక కార్యకర్త జిలకర వెంకటరామ్మూర్తి సూచించారు. గురువారం సమాచార హక్కు చట్టం దినోత్సవం సందర్భంగా దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆ చట్టంపై అవగాహన కల్పించారు. అవినీతి నిర్మూలనకు ఈ చట్టం ఎంతో సహాయపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండలానికి చెందికి పలువురు సామాజిక కార్యకర్తలు సతీష్, క్రాంతి, కిరణ్, కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నూతన అటవీ చట్టాన్ని రద్దు చేయాలి

భద్రాచలంటౌన్: పర్యావరణం పేరుతో కార్పొరేట్ శక్తులకు మేలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన అటవీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని టీఏజీఎస్ రాష్ట్ర నాయకుడు కారం పుల్లయ్య, బి.రవికుమార్‌లు డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కేంద్రం ప్రభుత్వం జీఓ నం.3ని ఆర్డినెన్స్ ద్వారా రూపకల్పన చేయాలని అన్నారు. సమావేశంలో గౌరీ నాగేశ్వరరావు, సున్నం గంగా, మడివి రమేష్, కుంజా శ్రీను, సోయం జోగారావు, పాయం నరసింహారావు, తిరుపతిరావు, చంటి, నారాయణ పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

మణుగూరురూరల్: సింగరేణి సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరికీ వేతనాలు పెంచి న్యాయం చేయాలని ఇఫ్టూ ఏరియా అధ్యక్షుడు ఏ.మంగీలాల్ యాజమాన్యం, ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఓసీ-4లో కాంట్రాక్ట్ కార్మికులు ఇఫ్టూ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మంగీలాల్ మాట్లాడుతూ.. సింగరేణి బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతల్లో పర్మినెంట్ కార్మికులతో సమంగా కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ ఉందన్నారు. వారి శ్రమకు తగ్గ వేతనాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు శంకర్, మల్లికార్జున్, కృష్ణ, శ్రీను, కమలాకర్, వెంకటరత్నం, సుబ్బరాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన యువజన నాయకుడు

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును గురువారం అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు మోటూరి మోహన్ కలిశారు. హైదారాబాద్‌లో కలిసి నియోజకవర్గంలోని పలు ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. యువత అంతా మెచ్చా నాగేశ్వరరావు వెంట నడిచి గెలుపునకు కృషి చేయాలని మంత్రి సూచించినట్లు మోహన్ తెలిపారు.

ముంపు నష్టాన్ని మరిచారా?

- వరదలతో నాడు ధ్వంసమైన రోడ్లు
- నేటికీ నోచుకోని మరమ్మతులు
- పరిశీలనకే పరిమితమైన కేంద్ర బృందం


దెబ్బతిన్న రహదారులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం (ఫైల్)


గోదావరి వరదలకు దెబ్బతిన్న రహదారి

బూర్గంపాడు: ఈ ఏడాది జూలైలో వచ్చిన గోదావరి వరద ముంపుతో భద్రాచలం డివిజన్‌లో చాలాచోట్ల రహదారులు కోతకు గురై తీవ్ర నష్టం వాటిల్లింది. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నచోట్ల రహదారులు కోతకు గురై కొట్టుకుపోయాయి. బూర్గంపాడు, అశ్వాపురం, దుమ్ముగూడెం, చర్ల మండలాలలో రాష్ట్రీయ రహదారులు కోతకు గురయ్యాయి. కల్వర్టులు కూడా కొట్టుకుపోయాయి. వరదలు తగ్గిన తరువాత వాహనాల రాకపోకలకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులు ఇప్పటికీ మారలేదు.

తాత్కాలిక ఏర్పాట్లతో సరి..

భద్రాచలం డివిజన్‌లో సుమారు 120 కిలోమీటర్ల మేరా రాష్ట్రీయ, జిల్లా పరిషత్ రహదారులు దెబ్బతిన్నాయి. వరద తగ్గిన తరువాత కేంద్ర బృందం పరిశీలనకు వచ్చింది. దెబ్బతిన్న రహదారులను పరిశీలించి స్థానిక అధికారుల నుంచి నష్టాల వివరాల నివేదికను తీసుకున్నారు. రహదారుల మరమ్మతులు, పునరుద్ధరణకు అవసరమైన అంచనాలతో నివేదికలను అందజేశారు. ఇది జరిగి నెలలు గడుస్తున్నా.. ఆర్అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేసిన తాత్కాలిక వసతులు తప్పా ఎలాంటి శాశ్విత పరిష్కారం చూపలేదు. దెబ్బతిన్న రోడ్లు అలానే ఉన్నాయి. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పటం లేదు.

ప్రమాదాలకు నెలవుగా రహదారులు

గోదావరి వరదలతో బూర్గంపాడు-కుక్కునూరు రహదారి సుమారు రెండు కిలోమీటర్ల మేరా రహదారి పూర్తిగా దెబ్బతింది. రహదారిపై వరద ఉధృతంగా ప్రవాహించటంతో బీటీరోడ్డుతో సహా అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోయింది. రోడ్డుకు ఇరువైపులా మూడు, నాలుగు అడుగుల మేరా గోతులు పడ్డాయి. కనీసం హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేయలేదు. ఈ రహదారిలో ప్రయాణం దినదినగండం నూరేళ్ల ఆయుష్షుగా సాగుతోంది. ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలకు దారితీస్తుంది. అదేవిధంగా, బూర్గంపాడు-సారపాక మధ్య రాష్ట్రీయ రహదారిపై గోదావరి వరదలకు గోతులు పడ్డాయి. ఈ రహదారిలో రోజుకు ఇద్దరు ముగ్గురైన ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కనీసం ఈ రహదారిలోని గోతులు పూడ్చేందుకు కూడా చర్యలు చేపట్టలేదు. అశ్వాపురం మండలం నెల్లిపాక గ్రామం వద్ద గోదావరి వరదలకు రహదారి బాగా దెబ్బతింది. అదేవిధంగా దుమ్ముగూడెం, చర్ల మండలాలలో కూడా గోదావరి వరదలకు రోడ్లు దెబ్బతిని వాహనాల రాకపోకలు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. వరదలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయకపోవటంతో సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు ఏం చేయలేని పరిస్థితులేర్పడ్డాయి. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో రహదారుల పనులు మరో మూడు నెలల పాటు వాయిదా పడే అవకాశాలున్నాయి.

మరమ్మతులు చేపట్టాలి



గోదావరి వరదలకు బూర్గంపాడు కొల్లుచెరువు వద్ద రోడ్డు బాగా దెబ్బతింది. వరద ఉధృతికి రోడ్డు మొత్తం కోతకు గురైంది. ఎదురెదురుగా వాహనాలు వచ్చే క్రమంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలు జరుగుతున్నాయి. మరమ్మతులకు చర్యలు చేపట్టాలి.

– ఇమడాబత్తుని రామకృష్ణ, బూర్గంపాడు

గోతులు కూడా పూడ్చడం లేదు



గోదావరి వరదలతో రోడ్లు పాడయ్యాయి. రోడ్లు మొత్తం గోతులు పడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. చాలా మంది ప్రమాదాల బారిన పడుతున్నారు. గోతుల్లో కనీసం మట్టికూడా పోయలేదు. ఇప్పటికైనా రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి.

– మండవ రామాంజి, నాగినేనిప్రోలు

గ్రామాల్లో వైద్యశిబిరాలు


దుమ్ముగూడెం: జిన్నెలగూడెంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న డాక్టర్ రేణుకారెడ్డి

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో లక్ష్మీనగరం గ్రామంలోని ఏకలవ్య పాఠశాల, పర్ణశాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జిన్నెలగూడెం గ్రామంలో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించారు. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు పుల్లారెడ్డి, రేణుకారెడ్డిల ఆధ్వర్యంలో రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది హెల్త్ అసిస్టెంట్ గంగాధర్, పీహెచ్ ఎన్.వెంకట్ నరసింహా, హెచ్ఎ.నాగేశ్వరరావు, ఏఎన్ఎం భూలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ నలంద, ఆశావర్కర్‌లు పాల్గొన్నారు.

మణుగూరు మున్సిపాలిటీలో..

మణుగూరురూరల్: మున్సిపాలిటిలోని కుంకుడుచెట్ల గుంపులో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ వివిధ రోగాలతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఇంటింటినీ సందర్శించి ఆరోగ్యం, పరిశుభ్రతపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రాంప్రసాద్, నాగజ్యోతి, జ్యోతి, సరస్వతి, రవి,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నియంతృత్వంపై పోరాడాలి

అశ్వాపురం: నియంతృత్వ పాలకులకు వ్యతిరేకంగా సబ్బండ జాతులు ఐక్యంగా పోరాడాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు గౌని ఐలయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎస్‌కేటీ కల్యాణ మండపంలో గురువారం ప్రగతిశీల మహిళా సంఘం భద్రాచలం డివిజన్ మహాసభను నిర్వహించారు. తొలుత పీఓడబ్ల్యూ నాయకురాలు పెదగోని ఆదిలక్ష్మి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఐలయ్య మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో బూర్జువా పార్టీలు రకరకాల హామీలతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు మాయమాటలు చెబుతున్నారన్నారు. ముఖ్యంగా బీజేపీ, బీఆర్ఎస్‌లకు అవకాశం ఇస్తే మరింత నష్టపోతామన్నారు. సమావేశంలో పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి నిర్మల, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ ఊక్లా, ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు మిడిదొడ్ల నాగేశ్వరరావు, జక్కం కొండలరావు, కొడెం రాధ, రాపర్తి లక్ష్మి, ధనలక్ష్మి, కమలమ్మ, సంధ్య, సూర్యకాంతం, కుమారి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో ముస్తాబవుతున్న గద్దెలు

చర్ల: బతుకమ్మ సంబరాలకు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మహిళలు గద్దెలను ముస్తాబు చేస్తున్నారు. గద్దెల చుట్టూ శుభ్రం చేయడం, గద్దెలకు రంగులు దిద్దడం, పరిసరాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయడం వంటి పనుల్లో మహిళలతో పాటు యువకులు బీజీ అయ్యారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.


గుంపెన్నగూడెంలో రంగులు దిద్దుతున్న మహిళలు

జోనల్ స్థాయి క్రీడలు ప్రారంభం


దమ్మపేట: క్రీడాకారులతో ఏటీడీఓ చంద్రమోహన్

దమ్మపేట: మండల పరిధిలోని పార్కలగండి బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జోనల్ స్థాయి గిరిజన క్రీడలను ఎంఈఓ కీసర లక్ష్మి ప్రారంభించారు. గురువారం పార్కలగండి ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన గిరిజన క్రీడల ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐటీడీఏ భద్రాచలం నుంచి ఏటీడీఓ చంద్రమోహన్ హాజరయ్యారు. ఈ క్రీడలకు ఐటీడీఏ జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ బొల్లి గోపాలరావు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఈ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులను కిన్నెరసానిలో జరిగే జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక చేస్తారని హెచ్ఎం ధర్మ తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటనారాయణ, వెంకటేశ్వర్లు, రామారావు, నాగేంద్రమ్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని కొత్తపల్లి ఆశ్రమ పాఠశాలలో దుమ్ముగూడెం, చర్ల మండలాల జోనల్ స్థాయి ఆశ్రమ పాఠశాలల క్రీడా ఎంపికలు గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు పీ.మణెమ్మ, పీఎంఆర్సీ ఏసీఎంఓ టి.రమణయ్యలు పాల్గొని జెండా ఊపి క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మణెమ్మ మాట్లాడారు. జోనల్ స్థాయి క్రీడల కార్యక్రమానికి కొత్తపల్లి పాఠశాల హెడ్మాస్టర్ మడకం మోతీరు, కారం సర్వేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ బట్ట హరికృష్ణ, వివిధ ఆశ్రమ పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లు, కొత్తపల్లి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

16న అప్రెంటిస్ మేళా

బూర్గంపాడు: ఈ నెల 16వ తేదీన కృష్ణసాగర్ ప్రభుత్వ రెసిడెన్సియల్ ఐటీఐ కళాశాలలో అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు. గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో జిల్లాలో ఐటీఐ పాస్ అయిన అభ్యర్థులు వివిధ పరిశ్రమల్లో అప్రెంటీస్‌షిప్ కోసం ఈ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకుని, బయోడేటా, విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలతో మేళాకు హాజరుకావాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ జగదీశ్వర్‌ప్రసాద్, ఎంపీడీఓ అన్నపూర్ణ గురువారం సందర్శించారు. అక్కడి వసతులు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ర్యాంపులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ షబ్నా, ఎస్సై షాహీన, ఆర్ఐ మధు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలతో సమావేశం

చంద్రుగొండ: తన కార్యాలయంలో తహసీల్దార్ సాదియాసుల్తాన గురువారం బీఎల్ఓలతో సమావేశమైయ్యారు. బూత్‌ల వారిగా ఓటర్ల జాబితా, తప్పొప్పులు, మృతుల తొలగింపు తదితర అంశాలపై బీఎల్‌ఓలకు సూచనలు చేశారు. తుది జాబిత త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, ఆర్ఐ అక్బర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన గురువారం రాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేటకు చెందిన మసికి నవ్య అనే మహిళ, మూడేళ్ల చిన్నారితో కలిసి నడుచుకుంటూ వెళ్తుండగా.. స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద నరాల శెట్టి నాగేశ్వరరావు అనే వ్యక్తి స్కూటీ అదుపు తప్పి వారికిని ఢీ కొట్టింది. దాంతో నవ్య, చిన్నారికి గాయాలు కాగా, స్థానిక ఎస్సై శ్రీకాంత్ చిట్టితల్లి అంబులెన్స్‌కు సమాచారం మేరకు ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేసి నాగేశ్వరరావుకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం సత్తుపల్లి ఆస్పత్రికు తరలించారు.

కిట్లు పంపిణీ

చంద్రుగొండ: ఫైలేరియా వ్యాధి బాధితులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ వెంకట్‌ప్రకాష్ గురువారం కిట్లు పంపిణీ చేశారు. సబ్‌యునిట్ ఆఫీసర్ కుమారస్వామి, హెల్త్ సూపర్‌వైజర్ యండి.ఇమాం, సిబ్బంది లక్ష్మి, అనిత, శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

గని మేనేజర్‌కు వినతి

మణుగూరురూరల్: సింగరేణి సంస్థలోని ఉపరితల గనుల్లో పని చేస్తున్న కార్మికులకు సంబంధించి ప్లేడే, పీహెచ్‌డీలపై సింగరేణి యాజమాన్యం విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని కోరుతూ ఓసీ-2 ఆపరేటర్లు గురువారం గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆపరేటర్లు నాసర్‌పాషా, గట్టయ్య, కుమారస్వామి, శంకర్, ఈశ్వర్, జానకిప్రసాద్, అంజయ్య పాల్గొన్నారు.

దళితులను రెచ్చగొట్టడం సరికాదు


సమావేశంలో మాట్లాడుతున్న విప్ రేగా కాంతారావు

అశ్వాపురం: దళితబంధు విషయంలో కాంగ్రెస్ నాయకులు దళితులను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం సరైంది కాదని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. పినపాక నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదమే తనకు శ్రీరామ రక్ష అని వ్యాఖ్యానించారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో కేవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించిన మండల స్థాయి బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే రేగా కాంతారావు హాజరై ఎన్నికల ప్రచారానికి సంబంధించి సలహాలు, సూచనలు ఇచ్చారు. అత్యధిక మెజారిటీతో గెలిపించేలా ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించాలని అన్నారు. పినపాక నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుతానన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఎన్నా అశోక్‌కుమార్, మాజీ మండల అధ్యక్షుడు కందుల కృష్ణార్జున్‌రావు, జెడ్పీటీసీ సూదిరెడ్డి సులక్షణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రయాణించండి.. బహుమతి గెలవండి

మణుగూరురూరల్: టీఎస్ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి లక్కీడిప్ ద్వారా బహుమతులు గెలుచుకోవచ్చని మణుగూరు డిపో మేనేజర్ టి.స్వామి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. విజయదశమి సందర్భంగా మణుగూరు డిపో నుంచి 56 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి కోసం సంస్థ లక్కీడిప్‌ను ఏర్పాటు చేసిందని, ఇందులో భాగంగా ప్రయాణికులు తమ టిక్కెట్ వెనుక వివరాలు రాసి లక్కీడిప్ బాక్స్‌లో వేయాలని సూచించారు. విజయదశమి తరువాత రీజియన్‌లో ఐదుగురు పురుషులు, ఐదుగురు మహిళలను ఎంపిక చేసి రూ.9,900 బహుమతిగా అందజేయనున్నట్లు డీఎం తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలకు పాతర

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో వాహనదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ రూల్స్‌ను తుంగలో తొక్కుతున్నారు. ప్రతి వాహనదారుడూ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలంటూ ఆ శాఖ అధికారులు తరుచూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నప్పటికీ.. కొందరు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ మేరకు ఉదాహరణలు భద్రాచలం పట్టణ పరిధిలో తరచూ కనిపిస్తున్నాయి. కొందరు త్రిబుల్ రైడింగ్ చేస్తూ ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్నారు. హెల్మెట్ వాడకుండా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ర్యాలీలలో పాల్గొంటున్నారు. పోలీసులు ఫొటోలు కొట్టకుండా నంబర్ ప్లేట్‌లను తొలగిస్తున్నారు. దీనిపై పోలీసులు అప్రమత్తం అవ్వాల్సి ఉంది.


భద్రాచలం గోదావరి బ్రిడ్జిపై నంబర్ ప్లేట్ లేకుండా ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న యువకులు

ముమ్మరంగా తనిఖీలు


చర్ల: రాళ్లగూడెంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

చర్ల: మండలంలో పోలీసుల తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు అందజేసేందుకు రాజకీయ పార్టీ నేతలు డబ్బు, మద్యం, ఇతరత్రా తరలించవచ్చుననే అనుమానాలతో తనిఖీలను చేపట్టారు. ఇందులో భాగంగా సీఐ రాజగోపాల్ నేతృత్వంలో చర్ల-భద్రాచలం, చర్ల-వెంకటాపురం మార్గాల్లో పలు చోట్ల మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్‌పార్టీ పోలీసులు.. వచ్చి పోయే ప్రతీ వాహన్ని నిలిపి తనిఖీలు చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ప్రజలు సహకరించాలని కోరారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

అశ్వారావుపేటరూరల్: త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందుతుందని, వచ్చేది కాంగ్రెస్ రాజ్యమేనని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు జారే ఆదినారాయణ అన్నారు. స్థానిక వడ్డెర బజారు, మద్దిరావమ్మ గుడి సెంటర్, అశ్వారావుపేటలో గురువారం సాయంత్రం గడప గడపకూ కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ గ్యారెంటీ కార్డు పథకాలను ప్రచారం చేసి, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. ఎంపీటీసీ సభ్యురాలు వేముల భారతి, నాయకులు జూపల్లి ప్రమోద్, రామారావు, ఫణి నాగు, నరేష్, ప్రతాప్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో పూల సంబురాలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ, దసరా పండుగ సంబురాలు మొదలయ్యాయి. ప్రభుత్వం నేటి సెలవులను ప్రకటించడంతో గురువారం పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు, కళాశాలల్లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ఆడి పాడారు. శరన్నవ రాత్రులను పురస్కరించుకుని వేసే దుర్గమ్మ తొమ్మిది రోజుల అలంకరణ వేషాధారణలతో చిన్నారులు అలరించారు.

– సాక్షి నెట్‌వర్క్


దమ్మపేట: ప్రభుత్వ పాఠశాలలో బతుకమ్మలను ఎత్తిన చిన్నారులు


దుమ్ముగూడెం: నర్సాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో బతుకమ్మ సంబురాలు


భద్రాచలంటౌన్: రూపా స్కూల్‌లో చిన్నారుల బతుకమ్మ డాన్స్‌లు


ములకలపల్లి: బతుకమ్మలతో చిన్నారులు


భద్రాచలంటౌన్: లిటిల్ ఫ్లవర్స్ స్కూల్‌లో..


అశ్వాపురం: రవీంద్ర పబ్లిక్ స్కూల్‌లో..


మణుగూరురూరల్: మాంటిస్సోరి పాఠశాలలో..